దశాబ్ది ఉత్సవాలు - 2025
టీ మీడియా డిజిటల్
సామాజికం.. ప్రజల పక్షం...
www.tmedia.net.in
10 ANNIVERSARY Celebration
YouTube

Digital, tmedia.net.in

# టీ-మీడియా

మెయిన్ ఎడిషన్
సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 294
పేజీలు : 3
ఆదివారం 24.05.2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## వాహనదారులకు కేంద్రం షాక్..

### దేశంలో మరోసారి పెరిగిన పెట్రోల్, డీజిల్ ధర

**టీ మిడియా ,మే 23, ఢిల్లీ బ్యూరో**



పలు రాష్ట్రాల్లో ఎన్నికలు అయిపోగానే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వాహనదారులకు షాక్‌ల మీద షాక్ ఇస్తున్నది. కేంద్ర ప్రభుత్వం వాహనదారులకు మళ్లీ షాక్ ఇచ్చిది. దేశవ్యాప్తంగా మరోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటర్ పెట్రోల్‌పై 97, డీజిల్‌పై 99 పైసల చొప్పున రేట్లను పెంచింది. కాగా, ఇంధన ధరల పెంపు ఈ నెలలో ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇటీవల లీటర్ పెట్రోల్, డీజిల్‌పై రూ.3వరకు పెంచిన సంగతి తెలిసిందే. పెరిగిన ధరలు నేటి ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చాయి. తాజా పెంపుతో హైదరాబాద్‌లో లీటర్ పెట్రోల్ ధర రూ.112.84, డీజిల్ రూ.100.94కు పెరిగింది.


## దేశంలో భానుడి ఉగ్రరూపం..

- రానున్న వారం రోజులూ తీవ్ర వడగాలులు..!

**టీ మిడియా ,మే 23, ఢిల్లీ బ్యూరో :**



దేశంలో భానుడు తన ఉగ్రరూపం చూపిస్తున్నాడు. చాలా ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండలు భగభగ మండుతున్నాయి. జనం ఇళ్ల నుంచి అడుగు బయటపెట్టాలంటే భయంతో వణికిపోతున్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్లకే పరిమితం అవుతున్నారు. రానున్న వారం రోజులపాటు కూడా తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రెండు తెలుగు రాష్ట్రాలు సహా వాయవ్య, మధ్య, తూర్పు భారత్‌లోని పలు మైదాన ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని అంచనావేసింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్థాన్‌లలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఐఎండీ వెల్లడించింది. విదర్భ, ఆంధ్రాలోని తీరప్రాంతం, యానాం, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, తెలంగాణ, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోనూ వడగాలులు వీచే అవకాశముందని తెలిపింది. శుక్రవారం ఉదయం దాదాపు 11 గంటల సమయానికి నమోదైన ఉష్ణోగ్రతల ప్రకారం.. ప్రపంచంలోనే 50 అత్యంత వేడి నగరాలన్నీ భారత్‌లోనే ఉన్నాయి. ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ ఈ గణాంకాలను వెల్లడించింది. తెలంగాణ సమాచారంజాబితాలోని సగం నగరాలు ఉత్తరప్రదేశ్‌లోనివే కావడం గమనార్హం. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బీహార్, తెలంగాణ, హర్యానా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలూ ఇందులో ఉన్నాయి.



## వడదెబ్బకు 16 మంది మృత్యువాత

- మరణించిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం

**టి మీడియా, మే 23, హైదరాబాద్ బ్యూరో :**

వడగాలుల ప్రభావంతో ఏడు జిల్లాల్లో 16 మంది మృత్యువాత పడ్డట్లు ప్రభుత్వం వెల్లడించింది. నిన్నటి ఎండ తీవ్రత కారణంగా 34 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. మరణించిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల రూపాయల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు రాష్ట్ర రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నలుగురు, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో ముగ్గురు చొప్పున, జోగులాంబ గద్వాల, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కొక్కరు మృతి చెందినట్లు కలెక్టర్లు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు.

### ప్రజలకు ముందస్తు హెచ్చరికలు

ఎండలు, వడగాలుల తీవ్రత నేపథ్యంలో సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అత్యవసర సమీక్ష నిర్వహించారు. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న మండలాలు, గ్రామాలను గుర్తించి అక్కడి ప్రజలకు ముందస్తు హెచ్చరికలు చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని వెల్లడించారు. బస్ స్టాండ్లు, మార్కెట్లు, ప్రధాన రహదారులు, కార్మికులు ఎక్కువగా పనిచేసే ప్రాంతాలు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో చల్లని తాగునీరు, మజ్జిగ, ఓఆర్ఎస్? ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు.

### జీవరాశుల సంరక్షణ మన బాధ్యత

కలెక్టర్లు వడగాలుల పరిస్థితులను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని గ్రామ, మండల స్థాయి సిబ్బంది అందరూ క్షేత్రస్థాయిలో ఉండాలని అన్నారు. ఎండదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స అందించేలా అత్యవసర వైద్య సేవలను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రజలతో పాటు జీవరాశుల సంరక్షణ కూడా మన బాధ్యతేనన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నీటి తొట్టెలు, మట్టి కుండల ద్వారా పక్షులు, జంతువులకు తాగునీరు ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు.

### రోజంతా ఎండలో డ్యూటీ చేయడంతో మృతి

పెరుగుతున్న ఉష్ణాగ్రతలతో రాష్ట్రంలో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు గురై ప్రాణాలు కోల్పోతున్నారు. వడదెబ్బకు గురై పెద్దపల్లి, నిజామాబాద్ జిల్లాలో ముగ్గురు చొప్పున మరణించారు. మృతుల్లో ఒకరు హోంగార్డు కాగా, ఇద్దరు కూలీలు, ఇంకొకరు వ్యాపారి. రోజంతా ఎండలో హైవేపెట్రోలింగ్ డ్యూటీ చేయడంతో ఆరోగ్యం సహకరించక ఆసుపత్రికి వెళ్తున్న క్రమంలో శ్రీనివాస్ కింద పడి మృతి చెందారు. మృతుల్లో ఒకరు మహారాష్ట్ర చంద్రాపూర్‌కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. పని నిమిత్తం ఆదిలాబాద్ వెళ్లిన చెప్పుల వ్యాపారి రాజేశ్వర్ వడదెబ్బ తగిలి చికిత్స పొందుతూ రాజేశ్వర్ మృతిచెందారు.

### సరస్వతి అంత్య పుష్కరాల్లో విషాదం

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాల్లో విషాదఘటన చోటుచేసుకుంది. కాళేశ్వరంలోని ఇప్పల్ బోరు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి వడదెబ్బతో మృతి చెందాడు. పుష్కరాలకు వచ్చిన ఆ వ్యక్తి ఇప్పలబోరు వద్ద అపస్మారక స్థితిలో పడిఉండగా స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు, వైద్య సిబ్బంది అక్కడికి చేరుకుని పరీక్షించి 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే ఆవ్యక్తి వడదెబ్బతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బయటకు వెళ్లే సందర్భాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.


### రాష్ట్రంలో భానుడి భగభగలు

తెలంగాణలోని 15 జిల్లాల్లో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కొత్తగూడెం జిల్లాలో అత్యధికంగా 46.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా నారాయణపేట జిల్లాలో అత్యల్పంగా 39.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతల వివరాలు ఇలా ఉన్నాయి.

## భారత్-అమెరికా కలిసి పనిచేస్తాయి

- ప్రధాని మోదీతో రూబియో భేటీ

**టీ మిడియా ,మే 23 ఢిల్లీ బ్యూరో :**



ప్రపంచ శ్రేయస్సు కోసం భారత్- అమెరికా నిరంతరం కలిసి పనిచేస్తాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో నాలుగు రోజుల భారత పర్యటన నిమిత్తం శనివారం ఢిల్లీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో రక్షణ, వాణిజ్యం, ఇంధనం వంటి రంగాల్లో ద్వైపాక్షిక సహకారంపై ప్రధాని మోదీ విస్తృత చర్చలు జరిపారు. అలాగే, పశ్చిమాసియాలోని పరిస్థితిపై వాషింగ్టన్ దృక్పథాన్ని రూబియో మోదీకి వివరించారు. అయితే, చర్చలు, దౌత్యం ద్వారా శాంతియుత పరిష్కారానికి భారత్? నిరంతరం మద్దతు ఇస్తుందని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. రక్షణ, వ్యూహాత్మక సాంకేతికతలు, వాణిజ్యం పెట్టుబడి, ఇంధన భద్రత, విద్య, ప్రజల మధ్య సంబంధాలతో సహా అనేక రంగాల్లో ద్వైపాక్షిక సహకారంలో సాధించిన నిరంతర పురోగతి గురించి రూబియో ప్రధానికి వివరించారు. అంతకుముందు కోల్‌కతాలోని మిషనరీస్ ఆఫ్ ఛారిటీకి చెందిన మదర్ థెరిసా హౌస్‌ను రూబియో సందర్శించారు. అనంతరం ఢిల్లీకి వెళ్లిన ఆయన మోదీతో భేటీ అయ్యారు. ఆదివారం విదేశాంగ మంత్రి ఎస్? జైశంకర్ తో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు. ఈనెల 25న ఆగ్రా, జైపుర్ నగరాలను సందర్శించనున్న రూబియో 26న ఢిల్లీలో జరిగే క్వాడ్ కూటమి విదేశాంగమంత్రుల సమావేశంలో పాల్గొనున్నారు.

## యాదగిరిగుట్ట సందర్శించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

### 15 ఎకరాల్లో వేదపాఠశాల నిర్మాణానికి శంకుస్థాపన

**టి మీడియా, మే 23, యాదగిరిగుట్ట :**



తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టలో సంప్రదాయ వేద విద్యను బోధించే గురుకులం ఏర్పాటవ్వనుంది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయనగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్నటువంటి వేద పాఠశాల భవనానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కంచికామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. మొత్తంగా రూ.100 కోట్లతో చేపట్టే పనులకు రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. ప అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. వచ్చే రెండేళ్లలో వేదపాఠశాల నిర్మాణం పూర్తిచేసి తరగతులు ప్రారంభించనున్నారు. దీంతో పాటు రూ.1.41 కోట్లతో మెట్లమార్గానికి పైకప్పు, రూ.1.44 కోట్లతో మాడ వీధులకు మెట్లు, రూ.43.5 కోట్లతో దీక్షాపరుల మండలం పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. సీఎం పర్యటన సందర్భంగా అధికారులు పకడ్బందీ ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేస్తున్న వేదపాఠశాలలో కంచి కామకోటి పీఠం పర్యవేక్షణలో బోధన చేపట్టనున్నారు. రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదంతోపాటు ఆగమ శాస్త్రాన్ని అధ్యయనం చేసేందుకు వీలు కల్పించి విద్యార్థులకు పట్టాలు అందించనున్నారు. కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ లు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాల పనులకు రూ.వెయ్యి కోట్లు




- ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నభోజనం
- జూన్ 1 నుంచి ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ప్రారంభం
- తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంఆమోదం




**టి మీడియా, మే 23, హైదరాబాద్ బ్యూరో :**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కాలేజీల్లో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని కేబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే 2027 గోదావరి పుష్కరాల కోసం రూ.1000 కోట్ల కేటాయింపుతో పాటు తొలివిడతగా రూ.300 కోట్ల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జూన్ 1 నుంచి ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ప్రారంభం అవుతుందని మంత్రి పొంగులేటి తెలిపారు.

### జూన్ 1 నుంచి ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ప్రారంభం

జూన్ 1 నుంచి ఇందిరమ్మ ఇళ్ల రెండో విడత ప్రారంభం అవుతుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రెండో విడతలో నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లు ఇస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న 500 ఇళ్లకు నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. స్థలాలు ఉన్నవారికి రూ.5 లక్షల కేటాయింపు జరుపుతున్నామని.. మూడు, నాలుగు విడతలుగా ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని పొంగులేటి తెలిపారు.

కేబినెట్ ఆమోదం తెలిపిన అంశాలు

జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు కేబినెట్ ఆమోదం. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని కేబినెట్ నిర్ణయం. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల పనులకు రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తూ ఆమోదం గోదావరి పుష్కరాలకు తొలివిడతగా రూ.300 కోట్ల మంజూరుకు కేబినెట్ ఆమోదం. గంగాధరలో నూతన డిగ్రీ కళాశాలలో పలు పోస్టుల మంజూరుకు ఆమోదం. 20 రెగ్యులర్ టీచింగ్, 6 నాన్‌టీచింగ్, అవుట్‌సోర్సింగ్ పద్ధతిన 3 పోస్టుల మంజూరుకు ఆమోదం. కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టులు మంజూరు చేస్తూ కేబినెట్ ఆమోదం. అస్సాం రైఫిల్స్, బీఆర్ఎఫ్, సీఐఎస్ఎఫ్ గ్రూప్ సెంటర్ల ఏర్పాటుకు భూకేటాయింపునకు ఆమోదం. కరీంనగర్ జిల్లాలో 14 ఎకరాల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం వెలిదిలో 4, రుక్మాపూర్‌లో 5 ఎకరాల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం. గన్నేరువరం మండలంలో 5 ఎకరాల కేటాయింపునకు ఆమోదం. కార్మిక వేతనాలు: కార్మికులకు సంబంధించిన కనీస వేతనాలను సవరిస్తూ ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని క్యాబినెట్ ధృవీకరించింది. జూన్ 1 నుంచి అమల్లోకి రానున్న ఈ కొత్త విధానంతో దాదాపు 1.11 కోట్ల మంది కార్మికులకు లబ్ధి చేకూరనుంది .సంస్థల విలీనం: డీసీఎంఎస్సంస్థలను మార్క్‌ఫెడ్లో విలీనం చేయడానికి, అలాగే తెలంగాణ రూరల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ను హకా లో విలీనం చేయడానికి ఆమోదం లభించింది .సాగునీటి ప్రాజెక్టులు: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి భూసేకరణ, పునరావాసం మరియు మౌలిక వసతుల కల్పన కోసం రూ.587 కోట్లు కేటాయించారు లైఫ్ సైన్సెస్ పాలసీ: నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ (2026-30) కి కేబినెట్ ఆమోదం తెలిపింది. రానున్న ఐదేళ్లలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడం మరియు 5 లక్షల ఉద్యోగాలను సృష్టించడం దీని లక్ష్యం .పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, "ప్రజల సంక్షేమం మరియు తెలంగాణ సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని స్పష్టం చేశారు. కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసేలా ఉంటాయని పేర్కొన్నారు. మంత్రి మాట్లాడుతూ, పరిశ్రమలకు అనుకూల వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధిని వేగవంతం చేయడంతో పాటు యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. కొత్త పెట్టుబడులు ఆకర్షించేందుకు పారదర్శక విధానాలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు గృహసౌకర్యం కల్పించడం ప్రభుత్వ కర్తవ్యమని ఆయన అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు అందే వరకు ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని వెల్లడించారు. వ్యవసాయ రంగంపై కూడా కేబినెట్ ప్రత్యేకంగా చర్చించిందని, రైతులకు సాగునీరు, విద్యుత్, ఎరువులు, మార్కెటింగ్ సదుపాయాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అలాగే విద్య, వైద్య రంగాల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు భారీ నిధులు వెచ్చిస్తున్నామని చెప్పారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు నిర్ణయం విద్యార్థుల ఆరోగ్యం మరియు చదువుకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. చివరగా ప్రజలు ప్రభుత్వంపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పని చేస్తామని, తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు.

## చైనాలో బొగ్గు గనిలో గ్యాస్ పేలుడు

### 82 మంది మృతి

**టీ మిడియా ,మే 23, ఢిల్లీ బ్యూరో**



బీజింగ్: చైనాలోని ఉత్తర షాంగ్జీ ప్రావిన్స్‌లోని ఒక బొగ్గు గనిలో గ్యాస్ పేలుడు సంభవించిన ఘోర ప్రమాదంలో కనీసం 82 మంది మరణించారని, డజన్ల కొద్దీ ప్రజలు భూగర్భంలో చిక్కుకుపోయారని శనివారం ప్రభుత్వ మీడియా వెల్లడించింది. అధికారిక వార్తా సంస్థ జిన్హువా ప్రకారం, చాంగ్జీ నగరంలోని లియుషెన్యు బొగ్గు గనిలో శుక్రవారం సాయంత్రం ప్రమాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో సుమారు 247 మంది కార్మికులు భూగర్భంలోచిక్కుకుపోయారని ఆ సంస్థ తొలుత నివేదించింది. ఎనిమిది మంది మరణించారని, మరో 38 మంది భూగర్భంలో చిక్కుకుపోయారని శనివారం తెల్లవారుజామున ఒక వార్తా సంస్థ నివేదించిన తర్వాత, మృతుల సంఖ్య పెరిగింది. పేలుడుకు గల కారణంపై దర్యాప్తు జరుగుతోందని, సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపింది. ఘటనా స్థలానికి వందలాది మంది సహాయక సిబ్బందిని పంపారు. ఘటనా స్థలంలో పారామెడికల్ సిబ్బంది స్ట్రెచర్‌లను మోసుకెళ్లడం, వాటి వెనుక అంబులెన్స్‌లు కనిపించడం రాష్ట్ర మీడియా ప్రసారం చేసిన దృశ్యాల్లో కనిపించింది. 100 మందికి పైగా వ్యక్తులను ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఘటనా స్థలంలో సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. శుక్రవారం స్థానిక కాలమానం ప్రకారం 19:29 గంటలకు , షాన్‌క్సీలోని ఒక బొగ్గు గనిలో పేలుడు సంభవించిందని, ఈ ఘటన జరిగిన సమయంలో 247 మంది కార్మికులు విధుల్లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటన అనంతరం, క్షతగాతులకు చికిత్స అందించడంలోనూ, ప్రాణాలతో బయటపడిన వారి కోసం గాలించడంలోనూ ఎటువంటి ప్రయత్నాన్నీ విడిచిపెట్టవద్దని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధికారులను ఆదేశించారు.

## పెద్ది రిలీజ్‌కు ముందు భారీ షాక్

- పర్సంటేజ్ కావాల్సిందేనని ఎగ్జిబిటర్ల డిమాండ్
- ఎగ్జిబిటర్ల కీలక నిర్ణయం

3లో..



# మిస్సింగ్ కేసులపై సుప్రీంకోర్టు ఆందోళన



- **వాటిని కిడ్నాప్‌లుగా పరిగణించాలని ఆదేశం**

**టీ మిడియా ,మే 23, ఢిల్లీ బ్యూరో :**

దేశవ్యాప్తంగా పెరుగుతున్న చిన్నపిల్లల అదృశ్యం కేసులను తీవ్రంగా పరిగణించిన సుప్రీంకోర్టు, వాటిని కిడ్నాప్? కేసులుగా నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. తప్పిపోయిన పిల్లలను గుర్తించడంలో ఉన్న వ్యవస్థాగత వైఫల్యాలను సరిదిద్దడానికి, అక్రమ రవాణా (ట్రాఫికింగ్?) నెట్?వర్క్?లను అరికట్టడానికి ఈ ఆదేశాలు ఇచ్చింది. 2011లో తమిళనాడులో కుమార్తెను పోగొట్టుకున్న ఓ వ్యక్తి దాఖలుచేసిన ప్రజాప్రయోజన వాజ్యంపై జస్టిస్ అసహనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా, నిరంతరం పెరుగుతున్న పిల్లల అదృశ్యం కేసులపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా జస్టిస్? అమానుల్లా మాట్లాడుతూ, " చిన్న పిల్లల మిస్సింగ్ కేసుల్లో చాలా పెద్ద వ్యత్యాసం కనిపిస్తోంది. ప్రస్తుతం దాదాపు 47వేల మంది పిల్లలు ట్రేస్? కాకుండా మిగిలిపోయారు. గతేడాది ఈ సంఖ్య దాదాపు 10వేల మంది ఉండవచ్చు. ప్రతి సంవత్సరం ఈ బ్యాక్?లాగ్? పెరుగుతూనే ఉంది" అని ఆందోళన వ్యక్తం చేశారు.తప్పిపోయిన పిల్లలు తరచుగా వ్యవస్థీకృత అంతర్?-రాష్ట్ర అక్రమ రవాణా ముఠాల (సిండికేట్స్?) బారిన పడుతున్నారనే క్షేత్రస్థాయి వాస్తవానికి సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించింది. పోలీస్ యంత్రాంగం నిర్వహిస్తున్న 'క్రైమ్? అండ్ క్రిమినల్ ట్రాకింగ్? నెట్?వర్క్? అండ్ సిస్టమ్స్?' డేటాబేస్?, చైల్డ్? వెల్ఫేర్? అధికారులు నిర్వహిస్తున్న 'విశాల్ వాత్సల్య' డేటాబేస్ మధ్య సరైన సమన్వయం, ఏకీకరణ లేకపోవడం వల్ల ఈ సమస్య మరింత తీవ్రమవుతోందని కోర్టు పేర్కొంది. ఈ నేపథ్యంలో పిల్లల మిస్సింగ్ సమస్యను పరిష్కరించడానికి సర్వోన్నత న్యాయస్థానం తాత్కాలికంగా 5 కీలక ఆదేశాలను జారీ చేసింది.

వివిధ సంస్థలు నిర్వహిస్తున్న డేటాబేస్?లను ఏకీకృతం చేయాలి. తద్వారా పోలీసులు, చైల్డ్? వెల్ఫేర్ కమిటీలు, జిల్లా బాలల రక్షణ విభాగాలు, బాలల సంరక్షణ కేంద్రాల మధ్య సమాచారం (రియల్?-టైమ్?) తక్షణమే బదిలీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోర్టు ఆదేశించింది.
జిల్లాలో యాంటీ హ్యూమన్? ట్రాఫికింగ్ యూనిట్లు ఏర్పాటు చేసినప్పటికీ, అవి పనిచేయడం లేదని లేదా కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ఏహెచ్?టీయూలను తగిన అధికారాలు, అవసరమైన మౌలిక సదుపాయాలతో నాలుగు వారాల్లోపు పూర్తి స్థాయిలో పనిచేసేలా చేయాలని ఆదేశించింది.
ఒక బిడ్డ అదృశ్యమైనప్పుడు, అధికారులు దానిని ముందుగానే కిడ్నాప్? లేదా అపహరణగా భావించి దర్యాప్తు ప్రారంభించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇలాంటి కేసులను కిడ్నాప్? నిబంధనల కింద నమోదు చేయడం వల్ల దర్యాప్తులో సీరియస్?నెస్? పెరుగుతుందని, విధానపరమైన అస్పష్టత వల్ల జరిగే ఆలస్యాన్ని నివారించవచ్చని అత్యున్నత ధర్మాసనం పేర్కొంది. పరిస్థితులు మానవ అక్రమ రవాణా లేదా వ్యవస్థీకృత నేర ముఠాల ప్రమేయాన్ని సూచిస్తున్నట్లయితే, దర్యాప్తు సంస్థలు ఆ కేసులను యాంటీ హ్యూమన్? ట్రాఫికింగ్? యూనిట్లకు బదిలీ చేయడానికి నాలుగు నెలలపాటు వేచి చూడకూడదని కోర్టు స్పష్టం చేసింది.
రక్షించిన పిల్లలను సాధారణంగా 24 గంటల్లోపు వారి కుటుంబాలకు అప్పగించాలని సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఒకవేళ ఆ కుటుంబానికే అక్రమ రవాణా లేదా వేధింపులతో సంబంధం ఉందని ఆధారాలు ఉంటే, అప్పుడు ఆ పిల్లలను రాష్ట్ర ప్రభుత్వం, చైల్డ్ వెల్ఫేర్? కమిటీలే చూసుకోవాలని పేర్కొంది.
రక్షించిన ప్రతి బిడ్డకు ఆధార్? నమోదు, ధ్రువీకరణ (వెరిఫికేషన్?) జరగాలని, దీని వల్ల నకిలీలను నిరోధించడానికి వీలవుతుందని కోర్టు పేర్కొంది. పిల్లల ఆధార్?, పర్యవేక్షణను నిర్ధరించడానికి జిల్లా బాలల రక్షణ విభాగాలలు (డీసీపీయూ) చురుగ్గా సమన్వయం చేసుకోవాలని ఆదేశించింది. ఈ కేసు విచారణ ఇంకా కొనసాగుతుందని, దేశవ్యాప్తంగా అధికారులు ఈ ఆదేశాలను ఎంత వరకు అమలు చేశారో పరిశీలించిన తర్వాత తదుపరి ఆదేశాలు ఇస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కేసు తదుపరి విచారణను 2026 ఆగస్టుకు వాయిదా వేసింది.

**కేసు నేపథ్యం ఏమిటి?**

2011 సెప్టెంబర్? 19న చెన్నైలో తన కుమార్తె అదృశ్యం కావడంతో జి.గణేశ్? అనే వ్యక్తి మద్రాస్? హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్? దాఖలు చేశారు. ఆ రోజే విరుగాంబాక్కం పోలీస్ స్టేషన్?లో ఫిర్యాదు చేయగా, ఎఫ్?ఐఆర్ నమోదు అయ్యింది. కానీ స్థానిక పోలీసులు, ఆ తర్వాత సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్? దర్యాప్తు చేసినప్పటికీ ఆ చిన్నారి ఆచూకీ లభించలేదు. చివరకు పోలీసులు ఈ కేసును 'అన్?డిటక్టబుల్'?(గుర్తించలేనిది)గా పేర్కొంటూ క్లోజర్ రిపోర్ట్ సమర్పించారు. ఆ తర్వాత తండ్రి దాఖలు చేసిన ప్రొటెస్ట్ పిటిషన్?ను కొట్టివేశారు. మద్రాస్ హైకోర్టు కూడా 2025 మార్చిలో ఇందులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. దీనితో బాధిత తండ్రి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ కేసులో అధికారులు, మద్రాస్ హైకోర్టు అనుసరించిన విధానంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. దీర్ఘకాలంగా పెండింగ్?లో ఉన్న తప్పిపోయిన పిల్లల కేసులను యాంటీ హ్యూమన్? ట్రాఫికింగ్ యూనిట్లకు బదిలీ చేయడంపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ 2013లో జారీ చేసిన సర్క్యులర్?, 2011లో తప్పిపోయిన ఈ చిన్నారికి వర్తించదనే వాదనను కోర్టు తప్పుబట్టింది. పిల్లల ఆచూకీ లభించనంత కాలం, బాలల రక్షణ మార్గదర్శకాలు, యాంటీ-ట్రాఫికింగ్? ప్రోటోకాల్?లను అమలు చేయాల్సిన బాధ్యత కొనసాగుతుందని సర్వోన్నత ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా తప్పిపోతున్న పిల్లల సమస్యపై సుమోటోగా విచారణ చేపట్టి, ప్రతి జిల్లాలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్? యూనిట్లను పునరుద్ధరించాలనే ఆదేశాలతో పాటు, పై మార్గదార్శకాలను జారీ చేసింది.

## ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపాదికన కొనుగోలు చేయాలి

- **రైతాంగ పోరాట సమితి**

**టీ మీడియా, మే 23, పెబ్బేరు**



పెబ్బేరు మండలం కేంద్రం లో వరి కొనుగోలు కేంద్రంలో రైతుల నిరసన తెలియజే యడం జరిగింది ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతాంగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి వరి ధాన్యం వచ్చి 2 నెలలు అవుతున్న పెబ్బేరు మార్కెట్ యార్డులో కొనుగోలు చేయడం లేదు కొనుగోలు కేంద్రం లో లావు (దొడ్డు రకం) సన్న రకం వడ్లు ఎండబెట్టి కుప్పలు కుప్పలు గా పోసుకున్నారు. తాలు తేమ లారీల తదితర సమస్యల కొరత పేరుతో కొనుగోలు చేయడం లేదు రైతులు రోజు వడ్ల కుప్పల దగ్గర పడి కాపులు కాస్తున్నారు.వరి కొనుగోలు ఆలస్యం జరిగితే అకాల వర్షాలు పడితే ఎండిన ధాన్యం తడిసి కొట్టుకు పోయే ప్రమాదం ఉన్నది అని రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికే రాష్ట్రంలో ఈ రకంగా ఆందోళన చెంది రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 20 మంది రైతులు చనిపోయారు.రాష్ట్రవ్యాప్తంగా వరి ధాన్యాన్ని కొనుగోలు చేయనందున వరికుప్పల దగ్గరే రైతులు ఉంటే ఇతర రకరకాల సమస్యలతో పాటు ఖరీఫ్ సీజన్ మొదలవుతున్నది, ఖరీఫ్ కు భూమి చదును చేయడం పెట్టుబడి ఖర్చులు తదితర సమస్యల పరిష్కారం కొరకు పనిచేయాల్సి ఉంటుంది ఈ మొత్తం సమస్యలను పక్కన పెట్టి ప్రస్తుతం వరికుప్పల దగ్గరే రైతులు పడి కాపులు కాస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వరి ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపాదికన కొనుగోలు చేయాలని తెలంగాణ రైతాంగ సమితి డిమాండ్ చేస్తున్నది నిరసన కార్యక్రమంలో రామకృష్ణ, బలరాం రామన్న పెబ్బేరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ధావత్‌కు పిలిస్తే వెళ్లిన బీఆర్ఎస్ నేత..

- **ఇంతలో దారుణం..!**

**టీ మిడియా ,మే 23 సూర్యాపేట:**



సూర్యాపేట జిల్లాలోని యల్కారం గ్రామంలో రాజకీయ కక్షలు మళ్లీ భగ్గుమన్నాయి. బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ మౌనిక భర్త, చింతలపాటి మధు దారుణ హత్యకు గురయ్యారు. శుక్రవారం (మే 22) సూర్యాపేటలోని తన నివాసం నుండి బయటకు వెళ్లిన మధు, సాయంత్రం నుండి ఫోన్లో అందుబాటులో లేకుండా పోయారు. అర్ధరాత్రి దాటిన తర్వాత యల్కారం గ్రామ శివారులోని ఓ పిల్ల కాలువలో అనుమానాస్పదంగా మూట కనిపించింది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు మధు మృతదేహంగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టిన పోలీసులు సంచలన విషయాలను గుర్తించారు.సూర్యాపేటలోని తాళ్లగడ్డ ప్రాంతానికి చెందిన తాటిపాముల జానయ్య అనే వ్యక్తి ఇంట్లోనే ఈ దారుణ హత్య జరిగినట్లు పోలీసులు నిర్ధారించారు. ఆ ఇంట్లో మద్యం సెట్టింగ్ ఏర్పాటు చేసిన ఆనవాళ్లను పోలీసులు గుర్తించారు. అక్కడే మధును హతమార్చి, అనంతరం మృతదేహాన్ని వాహనంలో యల్కారం శివారుకు తరలించినట్లు భావిస్తున్నారు. ఘటనా స్థలంలో క్లూస్ టీం ఆ ధ ా ర ా ల ు సేకరిస్తోంది. మృతుడు చింతలపాటి మధు 25 ఏళ్ల క్రితం జరిగిన గ్రామ మాజీ సర్పంచ్ మిద్దె రవీందర్ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఈ పాత కక్షల నేపథ్యంలోనే మిద్దె రవీందర్ వర్గీయులు పక్కా స్కెచ్‌తో మధును హత్య చేసి ఉంటారనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. యల్కారం ఫ్యాక్షన్ పరంగా అత్యంత సున్నితమైన గ్రామం కావడంతో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, పికెట్ నిర్వహించారు. యల్కారం గ్రామంలో 1985 నుండి రాజకీయ హత్యల పరంపర కొనసాగుతోంది. ఇప్పటివరకు ఇరువర్గాల మధ్య కక్షల కారణంగా సుమారు ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. 1985 ప్రాంతంలో గ్రామ టీడీపీ నాయకుడు యలగందుల సిద్దయ్య సూర్యాపేటలో దారుణ హత్యకు గురైయ్యారు. అప్పటి నుండి తాజాగా జరిగిన మధు హత్య వరకు సుమారుగా ఎనిమిది మంది రాజకీయ కక్షలు బలైయ్యారు. 1985 లో యలగందుల సిద్దయ్య హత్య తరవాత కాంగ్రెస్ నేత పల్లె ఈదయ్య అనంతరం 1996 సిద్దయ్య కుమారుడు అజయ్ హత్యకు గురైయ్యాడు. అప్పటి నుండి గ్రామం నీవురుగప్పిన నిప్పులా మారింది. అజయ్ హత్య జరిగిన కొద్దీ రోజులకే అప్పటి గ్రామ సర్పంచ్ మిద్దె రవీందర్ పై హత్యా యత్నం జరిగింది. ఆ ఘటనకు చింతలపాటి చిన్న రమేషే కారణమని భావించి 1999లో రమేష్ ని హత్య చేశారు.రమేష్ హత్య అనంతరం కొంత కాలం ప్రశాంతంగా ఉన్న గ్రామం తిరిగి 2007 లో మిద్దె రవీందర్ హత్యతో భగ్గుమంది. రవీందర్ హత్యతో పోలీసులు గ్రామం పై ప్రత్యేక దృష్టి సారించి గ్రామంలో మరో ఘటన జరగకుండా అన్ని వర్గాలకు కౌన్సిలింగ్ ఇచ్చి సమన్వయం చేశారు . కొద్దీ రోజులపాటు పోలీసుల చర్యలు ఫలితాల ఇచ్చి గ్రామం ప్రశాంతంగా మారింది. ఇంతలోనే 2020 లో మాజీ సర్పంచ్ ఒంటెద్దు వెంకన్నని గ్రామంలో దారుణంగా హత్య చేశాడు ప్రత్యర్థి వడ్డే ఎల్లయ్య. అయితే 2024 ఎల్లయ్యని జగ్గయ్యపేట సమీపంలో అతని ప్రత్యర్థి శ్రీకాంతా చారి హత్య చేశాడు. చింతలపాటి మధు 25 ఏళ్ళ క్రితం జరిగిన గ్రామ మాజీ సర్పంచ్ మిద్దె రవీందర్ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. తాజా ఘటన రవీందర్ వర్గీయులు చేసి ఉంటారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు .
ఈ వరుస హత్యలతో యల్కారం పేరు చెబితేనే చుట్టుపక్కల ప్రజలు హడలిపోతున్నారు. రాజకీయ కక్షల వల్ల నలిగిపోతున్న పలు కుటుంబాలు గ్రామాన్ని వదిలి వలస వెళ్తున్నాయి. పోలీసులు ఇకనైనా ఈ గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి, భవిష్యత్తులో ఇలాంటి రక్తపాతాలు జరగకుండా శాశ్వత శాంతిభద్రతలు నెలకొల్పాలని స్థానికులు కోరుతున్నారు.

## మైనర్ బాలికతో ప్రేమలో..

### ఫుట్‌బాల్ ఆటగాడి దారుణహత్య

**టీ మిడియా ,మే 23, ఢిల్లీ బ్యూరో :**




మైనర్ బాలిక ను ప్రేమించిన నడిపినందుకు వాలీబాల్ ప్లేయర్ దారుణహత్యకు గురయ్యాడు. ఈ షాకింగ్ ఘటన హర్యానా లోని ఫరీదాబాద్ లో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. రాజస్థాన్ కు చెందిన యువ వాలీబాల్ క్రీడాకారుడు 21 ఏళ్ల మోను (21) ఫరీదాబాద్‌కు చెందిన ఒక మైనర్ బాలికతో ప్రేమలో ఉన్నాడు. ఈ క్రమంలో గత ఏప్రిల్‌లో బాలిక కిడ్నాప్ ఆరోపణల నేపథ్యంలో మోనుపై కేసు కూడా నమోదైంది.మే 17న పోలీసు విచారణ కోసం స్టేషన్‌కు బయలుదేరిన మోనును మార్గమధ్యంలోనే బాలిక కుటుంబసభ్యులు కిడ్నాప్ చేసి ఒక ఇంట్లో బంధించారు. మూడు రోజులపాటు అన్నం పెట్టకుండా కాళ్లు చేతులు కట్టేసి ఇనుపరాడ్లతో తీవ్రంగా చిత్రహింసలకు గురిచేసి, మే 20న రోడ్డుపై పడేసి వెళ్లారు. తీవ్ర గాయాలపాలైన మోనును ఆస్పత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి ఆయన మరణించాడు. దాంతో కన్న కొడుకును కోల్పోయిన బాధితుడి కుటుంబసభ్యుల ఆక్రందనలు మిన్నంటాయి.
ఈ ఘోర ఘటనపై మృతుడి కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫరీదాబాద్ పోలీసులు హత్య, కిడ్నాప్ కేసులు నమోదు చేశారు. ఈ పరువు హత్యకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక క్రీడా సంఘాలు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కాగా ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు ప్రధాన అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు పోలీసు ప్రతినిధి వెల్లడించారు.

## లాయర్‌ను కారుతో గుద్ది చంపి హత్య

**వక్ఫ్ భూములను కాపాడుతున్నాడని కక్ష**

**టి మీడియా, మే 23, హైదరాబాద్ బ్యూరో :**



హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ పరిధిలో దారుణం జరిగింది. హైకోర్టు సీనియర్ న్యాయవాది ఖాజా మొయిజుద్దీన్?ను పక్కా ప్రణాళికతో, ఆయన ఇంటి ముందే కారుతో ఢీకొట్టి హత్య చేశారు. దశాబ్దాలుగా వక్ఫ్ బోర్డు ఆస్తుల రక్షణ కోసం ఆయన చేస్తున్న చట్టపరమైన పోరాటాలే ఈ హత్యకి కారణమని ఆయన కుమారుడు ఫరాన్ఖ్ ఆరోపించారు.

**ప్రణాళిక ప్రకారమే హత్య!**

తెల్లవారుజామున దాదాపు 05:45 గంటల సమయంలో ఖాజా మొయిజుద్దీన్ తన నివాసం నుంచి నిజాం క్లబ్‌కు స్విమ్మింగ్ వెళ్లేందుకు బయలుదేరారు. ఇది ఆయనకు ప్రతిరోజూ ఉండే దినచర్య కావడంతో, దుండగులు దీనిపై ముందే నిఘా పెట్టినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆయన విజయా టవర్స్ ప్రాంతంలో పార్క్ చేసి ఉన్న తన వాహనం వద్దకు చేరుకోగానే అప్పటికే అక్కడ ఉన్న ఒక గుర్తు తెలియని ఎస్‌యూవీ కారు ఒక్కసారిగా వేగంతో ఆయనపైకి దూసుకొచ్చింది. ఆ వాహనం మొయిజుద్దీన్‌ను అత్యంత బలంగా ఢీకొట్టింది. ఆ ఇంపాక్ట్‌కు ఆయన దాదాపు 10 మీటర్ల దూరం గాల్లోకి ఎగిరి రోడ్డుపై పడిపోయారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు ఆపకుండా వేగంగా అక్కడి నుండి వెళ్లిపోయింది.

**ఇది 6వ సారి దాడి**

ప్రమాదం జరిగిన వెంటనే ఖాజా మొయిజుద్దీన్?ను ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయనకు శరీరంలో పలు కీలక ఎముకలు విరిగాయి. రెండు పెల్విక్ ఎముకలు, కుడి భుజం పూర్తిగా ఫ్రాక్చర్ అవ్వడంతో పాటు శరీరమంతటా తీవ్రమైన అంతర్గత, బాహ్య గాయాలయ్యాయి. ఆసుపత్రి తీసుకెళ్లిన కాసేపటికే మొయిజుద్దీన్? చనిపోయినట్లు వైద్యులు ప్రకటించారు. తమ నాన్నపై ఇది 6వ సారి దాడి జరిగిందని ఆయన కుమారుడు ఫర్హాన్ ఆరోపించారు. ఈ దాడి వెనక ఆలం ఖాన్ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు.

**అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాల్సిందే**

ఖాజా మొయిజుద్దీన్? హత్య ఘటనపై హైదరాబాద్?లో లాయర్లు ఆందోళనకు దిగారు. తమ భద్రతకు అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తేవాల్సిందేనని, కేసు విచారణకు ప్రత్యేక సిట్? వేయాలని సీనియర్ లాయర్ రఘునాథ్ డిమాండ్ చేశారు. వక్ఫ్ ప్రాపర్టీస్ కేసుల్లో ఆయన వాదనలు వినిపిస్తున్నందుకే టార్గెట్ చేశారని స్పష్టమవుతోందని అన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం 'అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్'ను తక్షణమే గెజిట్ రూపంలో తీసుకొచ్చి, చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**సీసీటీవీ విజువల్స్ ఆధారంగా కేసు నమోదు**

ఘటన జరిగిన ప్రాంతంలో ఉన్న సీసీటీవీ కెమెరాల్లో ఈ ఘోర ఉదంతానికి సంబంధించిన దృశ్యాలు పూర్తిగా రికార్డ్ అయ్యాయి. ఒక ఎస్‌యూవీ కారు కావాలనే వేగంగా వచ్చి ఢీకొట్టినట్లు విజువల్స్ ఆధారంగా ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు, సీసీటీవీ క్లిప్పింగ్స్ ఆధారంగా కేసు నమోదు చేశామని మెహదీపట్నం సీఐ సైదులు తెలిపారు.

## కుప్పకూలిన ఆర్మీ విమానం

- **గాయాలతో బయటపడ్డ ముగ్గురు అధికారులు**

**టీ మిడియా ,మే 23, ఢిల్లీ బ్యూరో :**



లద్దాఖ్ సెక్టార్‌లో భారత సైన్యానికి చెందిన చీతా అనే హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు పైలట్లు, డివిజన్ కమాండర్ మేజర్ జనరల్ సచిన్ మెహతా గాయపడ్డారు. అయితే వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను నిర్ధారించేందుకు ఈ ఘటనపై విచారణకు ఆదేశించినట్లు వెల్లడించారు. బుధవారం (మే 20న) ఈ ప్రమాదం జరగ్గా, ఆలస్యంగా (శనివారం) వెలుగులోకి వచ్చింది.

**అసలేం జరిగిందంటే?**

లద్దాఖ్‌లోని లేహ్ సమీపంలో ఉన్న పర్వత ప్రాంతమైన టాంగ్‌స్టేలో ఇండియన్ ఆర్మీకి చెందిన చీతా హెలికాప్టర్ బుధవారం కూలిపోయింది. ఈ ప్రమాదంలో మేజర్ జనరల్‌తో సహా ముగ్గురు భారత ఆర్మీ అధికారులు ప్రాణాపాయం నుంచి త్రుటిలో బయటపడ్డారు. ఈ క్రమంలో స్వల్పంగా గాయపడ్డారు. వారు విమాన శిథిలాల నుంచి నడుచుకుంటూ బయటికి వచ్చారు. ఈ పరిణామాన్ని ఆర్మీ అధికారులు ఒక అద్భుతంగా అభివర్ణించారు.

**ప్రమాదంపై విచారణకు ఆదేశం**

సింగిల్ ఇంజిన్ హెచ్‌ఏఎల్ చీతా హెలికాప్టర్‌ను లెఫ్టినెంట్ కల్నల్, మేజర్ నడిపారు. అందులో మూడో పదాతిదళ విభాగం జనరల్ ఆఫీసర్ కమాండింగ్ మేజర్ జనరల్ సచిన్ మెహతా ప్రయాణికుడిగా ఉన్నారు. లద్దాఖ్‌లోని ఎత్తైన పర్వత ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. అయితే ఈ యాక్సిడెంట్ జరగడానికి గల కచ్చితమైన కారణాలు తెలుసుకునేందుకు ఆర్మీ అధికారులు అధికారిక విచారణకు ఆదేశించారు. విమానం కుప్పకూలినా అందులోని సిబ్బంది అందరూ ప్రాణాలతో బయటపడటం అసాధారణ విషయంగా ఉందని ఆర్మీ అధికారులు అభిప్రాయపడ్డారు.
ఫ్రెంచ్ అలోయెట్ ××× లైసెన్స్ నిర్మిత వెర్షన్ అయిన చీతా హెలికాప్టర్ ముఖ్యంగా సియాచిన్ గ్లేషియర్ వంటి ఎత్తైన ప్రాంతాలలో భారత సైన్యానికి చాలా కాలంగా కీలకం ఉంది. అయితే చీతా విమానాలు ఇటీవల కాలంలో వరుస ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ విమానాలపై తీవ్రమైన చర్చ జరుగుతోంది. గత 10-12 సంవత్సరాలలో 15కు పైగా చీతా, చేతక్ హెలికాప్టర్లు ప్రమాదాలకు గురయ్యాయి. ఈ యాక్సిడెంట్లలో పలువురు పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ క్రమంలో ఇండియన్ ఆర్మీ విస్తృత ఆధునీకరణ చర్యలు చేపట్టేందుకు సిద్ధమైంది. అందులో భాగంగా భారత సైన్యం రాబోయే ఒకటి నుంచి రెండు ఏళ్లలో పాతబడిన హెలికాప్టర్లను క్రమంగా తొలగించి, వాటి స్థానంలో కొత్త తేలికపాటి యుటిలిటీ హెలికాప్టర్లను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ భర్తీ ప్రక్రియ రాబోయే 8-10 సంవత్సరాల పాటు కొనసాగే అవకాశం ఉంది. కార్యాచరణ అవసరాలను తీర్చడానికి సైన్యానికి సుమారు 250 కొత్త హెలికాప్టర్లు అవసరం.ఇండియన్ ఆర్మీ విమానాల కొనుగోలు విషయంలో రెండు విధాల వ్యూహాన్ని అనుసరించాలని యోచిస్తోంది. తక్షణ కార్యాచరణ లోపాలను పూడ్చడానికి స్థానికంగా తయారైన తేలికపాటి యుటిలిటీ హెలికాప్టర్లను ఉపయోగించుకోవడంతో పాటు, అవే తరహా హెలికాప్టర్లను లీజుకు కూడా తీసుకోవాలనుకుంటోంది. ఈ పరివర్తనలో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ కీలక పాత్ర పోషిస్తుందని భావిస్తోంది. గంటకు 220 కిలోమీటర్ల గరిష్ఠ వేగం, 6.5 కిలోమీటర్ల సర్వీస్ సీలింగ్, 350 కిలోమీటర్ల కార్యాచరణ పరిధిని సాధించేలా రూపొందించిన ఆరు పరిమిత శ్రేణి తేలికపాటి యుటిలిటీ హెలికాప్టర్ల కోసం సైన్యం ఇప్పటికే హెచ్‌ఏఎల్‌కు ఆర్డర్ ఇచ్చింది. హెచ్‌ఏఎల్ సాయుధ దళాల కోసం 625 చీతా, చేతక్ హెలికాప్టర్లను లైసెన్స్‌పై ఉత్పత్తి చేసింది.
భారతదేశంలో చీతా హెలికాప్టర్‌ను తయారు చేయడానికి హెచ్‌ఏఎల్ 1970లో ఫ్రెంచ్ ఏరోస్పేస్ కంపెనీ ఏరోస్పేషియల్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. అంతకుముందు, 1962లో చేతక్ హెలికాప్టర్‌ను ఉత్పత్తి చేయడానికి ఎయిర్‌బస్‌లో భాగమైన ఫ్రెంచ్ సంస్థ సుడ్ ఏవియేషన్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. భారత సైన్యం, వైమానిక దళం నుంచి కనీసం 187 తేలికపాటి యుటిలిటీ హెలికాప్టర్ల కోసం సంయుక్త ఆర్డర్లు వస్తాయని హెచ్‌ఏఎల్ ఆశిస్తున్నట్లు ఆ సంస్థ అధికారులు తెలిపారు.ప్రస్తుతం ఉన్న చీతా విమానాలు లైఫ్ ఇంకొంత కాలం ఉందని ఆర్మీ వర్గాలు తెలిపాయి. అయినప్పటికీ అత్యంత క్లిష్టమైన ఎత్తైన ప్రాంతాలలో కార్యకలాపాల కోసం, ఈ విమానాలను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నాయి. లద్దాఖ్ విమాన ప్రమాదం వంటి ఘటనలు పునరావృతం కాకుండా నిరోధించడానికి వీలైనంత త్వరగా సమగ్ర, కార్యాచరణ విచారణను పూర్తి చేస్తామని వెల్లడించాయి.



## పిడుగుపాటుకు రెండు పశువులు మృతి

**టి మీడియా, మే 23, మహబూబ్ నగర్ :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో గాలి,వాన బీభత్సం సృష్టించింది. పలు ప్రాంతాల్లో చెట్లు నేల కొరగగా ,అచ్చంపేటలో పిడుగుపాటుకు రెండు పశువులు మృతి చెందాయి. పాలమూరులో కలెక్టరేట్ వద్ద బస్ స్టాప్ షెడ్ గాలివానకు రోడ్డు మీద పడింది.మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో దాదాపు అరగంట పాటు ఈదురు గాలులతో వర్షం పడింది. బైపాస్‌లో పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. కార్లు ద్విచక్ర వాహనాలకు నష్టం వాటిల్లింది. వనపర్తి జిల్లాలో భారీగా ఈదురు గాలులు, గాలివాన, వడగళ్ల వర్షంతో వరికి నష్టం జరిగిందని రైతులు వాపోయారు.

### పిడుగు పడి రెండు పశువులు మృతి

అచ్చంపేట రూరల్ : మండలంలోని బుద్ద తండాలో విషాద ఘటన చోటుచేసుకుంది. గిరిజన రైతు మోత్యకు చెందిన రెండు పశువులు పిడుగు పడి మృతి చెందాయి. శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షం సమయంలో వ్యవసాయ పొలంలో చెట్టుకు కట్టేసి ఉన్న పశువులపై ఒక్కసారిగా పిడుగు పడటంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి.వ్యవసాయం కోసం ఇటీవలే రూ.1.10 లక్షల వ్యయంతో రెండు పశువులను కొనుగోలు చేసినట్లు రైతు తెలిపాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని, నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని కోరాడు.

## సుడా చైర్మెన్ దుర్గ ప్రసాద్ అభినందన సభకు తరలిరావాలి

- **కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు గంట వెంకట్రావు**

**టీ మీడియా, మే 23, ముదిగొండ**



నేడు ఉదయం 10 గంటలకు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్‌లో జరగబోయే సుడా చైర్మెన్ పువాళ్ల దుర్గ ప్రసాద్ అభినందన సభకు వెంకటాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు గంట వెంకట్రావు శనివారం కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లిడిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. కావునా ఈ కార్యక్రమంలో వెంకటాపురం గ్రామం నుంచి అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


## ఆర్‌టిసి బస్ ఢీకొని ఓ వ్యక్తికి గాయాలు

**టీ మీడియా ,మే 23, పెబ్బేరు :**



పెబ్బేరు పట్టణంలో ఆర్ టి సి బస్ ఢీకొనగా ఓ వ్యక్తి కాలు విరిగి తీవ్ర గాయం రక్త స్రావం జరిగింది స్థానికుల సమాచారం పెబ్బేరు మండలం లోని పెంచికలపాడు గ్రామానికి చెందిన చిన్న హనుమంతు పెబ్బేరు మండల కేంద్రానికి వచ్చి బస్ స్టాండ్ దగ్గర రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఆర్ టి సి బస్ డికొట్టగా హనుమంతు కాలు విరిగి రక్త స్రావం జరిగింది గమనించిన స్థానికులు 108 కు దయల్ చేసి హాస్పిటల్ కు తరలించారు.

# ఖాతాలోంచి కట్ అవుతాయి కానీ చేతికి డబ్బులు రావు



- ఏటీఎంల వద్ద సరికొత్త మోసాలు

**టి మీడియా, మే 23, హైదరాబాద్ బ్యూరో :**

కన్నం వేసేవాడు ఒకడైతే, కాపలా కాసేవాడు మరొకడు అన్నట్లు బ్యాంక్ ఖాతాలో డబ్బులు ఉంటాయి. ఏటీఎంకు వెళ్లి పిన్ ఎంటర్ చేయగానే మెషిన్?లో డబ్బులు లెక్కించిన సౌండ్ వస్తుంది. కానీ క్యాష్ మాత్రం బయటకు రాదు. సర్వర్ ప్రాబ్లమ్ వల్లనో లేదా ట్రాన్సాక్షన్ ఫెయిల్ అయ్యిందనో కస్టమర్లు వెనుదిరిగిపోతారు. కానీ అసలు కథ ఇక్కడే మొదలవుతుంది. కస్టమర్ వెళ్లగానే ఏటీఎంలోకి వేరే వ్యక్తులు ప్రత్యక్షమవుతారు. క్షణాల్లో కస్టమర్ విత్ డ్రా చేసిన డబ్బులు తీసుకుని మాయం అవుతారు. అసలు కస్టమర్ విత్ డ్రా చేసిన డబ్బులను వాళ్లేలా కాజేస్తున్నారు? డ్రా అయ్యాక అవి ఎక్కడికి పోతున్నాయి? బ్యాంకు అధికారుల కన్నుగప్పి ఏటీఎం మోసాలకు పాల్పడుతున్న ఆ అంతర్రాష్ట్ర ముఠాల గురించి ఈ పూర్తి కథనంలో చూద్దాం!

హైదరాబాద్ మహా నగరంలో ఏటీఎం చోరీలు రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతున్నాయి. టెక్నాలజీ పెరిగే కొద్దీ బ్యాంకులకు కన్నం వేసేందుకు అంతర్రాష్ట్ర ముఠాలు సరికొత్త పద్ధతులను ఎంచుకుంటున్నారు. మొన్నటి వరకు ఏటీఎంల వద్ద పవర్ కట్ చేశారు. డిపాజిట్ మెషిన్లలో చేతులు పెట్టి రూ.లక్షలు కొల్లగొట్టారు. మరికొందరైతే ఏకంగా ఏటీఎం మెషిన్‌నే ఎత్తుకెళ్లారు. వీటన్నింటికీ భిన్నంగా ఇప్పుడు మరో కొత్త చోరీ ముందుకొచ్చింది. ఏకంగా ఏటీఎం క్యాష్ స్లాట్‌కే ఫైబర్ ప్లేట్లు అమర్చి, ఖాతాదారుల నగదుకు పెద్ద గండిపెడుతున్నారు.

**ఏటీఎం వద్ద సరికొత్త మోసం**

అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడైనా డబ్బులు డ్రా చేసుకోడానికి ఏటీఎం మెషిన్ ఉపయోగపడుతుంది. లిక్విడ్ క్యాష్ కంటే డెబిట్ కార్డ్ నయం కదా అనుకుంటారు. కానీ కస్టమర్లు, వృద్ధుల వీక్ నెస్‌లను అవకాశంగా మలచుకొని కొందరు డబ్బులు దండుకుంటున్నారు. తాజాగా జూబ్లీహిల్స్ పరిధిలోని ఎస్బీఐ ఏటీఎంలో ఇద్దరు దుండగులు అలాంటి సరికొత్త మోసానికి తెరతీశారు. ఓ వ్యక్తి దగ్గర నుంచి రూ.48 వేల నగదును కాజేశారు. ఖాతాలో నుంచి నగదు డెబిట్ అయినప్పటికి, ఏటీఎం నుంచి డబ్బు బయటకు రాకపోవడంతో కస్టమర్లు బ్యాంకును ఆశ్రయించారు. దీంతో సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించిన ఎస్బీఐ అధికారులు, ఫైబర్ ప్లేట్ గ్యాంగ్ బాగోతాన్ని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు రిటైర్డ్ డీసీపీ చెబుతున్నారు.

**ఫైబర్ ప్లేట్లనే మార్చుతున్న దుండగులు**

దొంగతనంలో ఒక్కొక్కరిది ఒక్కో స్టైలూ. కొందరు దొంగలు ఏటీఎంనే ఎత్తుకెళ్లుతుంటే, మరికొందరు వెనకాలే ఉండి డ్రా చేసిన డబ్బులు లాక్కెళుతున్నారు. ఇంకొందరైతే అనుమానం రాకుండా ఫైబర్ ప్లేట్లనే అమర్చుతున్నారు. ఇదంతా ఒకెత్తైతే, టెక్నాలజీని వాడుకొని ఆశ్చర్యపోయే దొంగాలోచనలు చేస్తున్నారు. కొన్ని ఏటీఎంలలో తల ఉపరితల భాగాన సీక్రెట్ కెమెరా పెడతారు. కస్టమర్ ఏటీఎంలో డబ్బులు డ్రా చేస్తున్నప్పుడు కార్డు డీటేయిల్స్, పిన్ నెంబర్ లాంటివి అన్ని రికార్డు చేసుకుంటారు. అది కాస్త సాయంత్రం అయ్యాక టెక్నాలజీని ఉపయోగించి క్లోనింగ్ పద్ధతి ద్వారా నకిలీ చిప్ తయారు చేస్తారు. దాంతో కావాల్సినంత డబ్బును బాధితుల అకౌంట్ల నుంచి డ్రా చేసుకుంటారు.

**డ్రా చేస్తున్న సమయానికి ఏటీఎం స్విచ్ ఆఫ్**

నగరంలో ఉన్న ఏటీఎంలను టార్గెట్ చేయడం నేరగాళ్లకు ఇది కొత్తేమీ కాదు. గతంలో టెక్నాలజీలోని చిన్న చిన్న లోపాలను ఆసరాగా చేసుకుని రూ.లక్షలు కొల్లగొట్టారు. కస్టమర్లు డబ్బులు డ్రా చేస్తున్న సమయానికి ఏటీఎం స్విచ్ ఆఫ్ చేయడం ఒక పద్ధతి. ఆ తరువాత కస్టమర్ వెళ్లాకా మళ్లీ స్విచ్ ఆన్ చేసి డబ్బులు తీసుకుంటారు. ఎందుకంటే ఇంతలో ట్రాన్సాక్షన్ ప్రాసెసింగ్‌లో ఉంటుంది. ఇలా హైదరాబాద్‌లోని ఎస్సార్ నగర్, సనత్ నగర్, పంజాగుట్ట తదితర ప్రాంతాల్లో ఈ విధంగా రూ.లక్షలు కాజేశారు. ఇక డిపాజిట్ మెషిన్లలో క్యాష్ బాక్స్ తెరుచుకోగానే మధ్యలోనే చేతితో ఆపేసి నగదు లాగేయడం మరో ట్రిక్. నల్లకుంట, సైదాబాద్, చిక్కడపల్లి ప్రాంతాల్లో ఎస్బీఐ డిపాజిట్ యంత్రాల నుంచి ఈ తరహాలో నగదు మాయం చేశారు.

**బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం వల్లే**

కొన్ని ప్రాంతాల్లో సెక్యూరిటీ గార్డులు లేని పాత ఏటీఎంలే దర్శనమిస్తాయి. వాటినే టార్గెట్‌గా మలచుకుంటారు ఈ అంతర్రాష్ట్ర ముఠాలు. హర్యానాలోని మేవాత్, రాజస్థాన్ ప్రాంతాలకు చెందిన ఈ కేటుగాళ్లు పాత ఏటీఎంలోని సాంకేతిక లోపాలపై ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. అక్కడి నుంచి పెద్ద పెద్ద నగరాలకు చేరుకుని, గూగుల్ మ్యాప్స్ సాయంతో ఏటీఎంలను గుర్తిస్తూ ఆటోలు, టూ వీలర్లపై తిరుగుతూ చోరీలకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామునే జనం రద్దీగా ఉండని ప్రాంతాలను టార్గెట్ చేస్తున్నారు. సెక్యూరిటీలు లేని ఏటీఎంలలో చోరీలు జరగడంలో బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం ఉందని ఆరోపణలు వస్తున్నాయి.

**ఏటీఎంలకు వెళ్లే ఖాతాదారులకు సూచనలు**

కొత్తరకం మోసాలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో ఏటీఎంలకు వెళ్లే ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

ఏటీఎం కేంద్రంలోకి వెళ్లగానే క్యాష్ వచ్చే స్లాట్ వద్ద గానీ, కీప్యాడ్ వద్ద గానీ ఏమైనా అనుమానాస్పదంగా గమ్ ప్లేట్లు, వస్తువులు అతికించి ఉన్నాయేమో ఒకసారి గమనించాలి. ఒకవేళ మీ ఖాతాలో నగదు కట్ అయ్యి, మెషిన్ నుంచి డబ్బులు రాకపోతే వెంటనే కంగారుపడి బయటకు వెళ్లిపోకూడదు. కొంతసేపు అక్కడే వేచి చూడాలి. క్యాష్ స్లాట్ వద్ద ఏమైనా అడ్డుగా ఉందేమో చేతితో తనిఖీ చేయాలి. అనుమానం వస్తే వెంటనే బ్యాంక్ టోల్ ఫ్రీ నెంబర్‌కు గానీ లేదా డయల్ 100కి గానీ కాల్ చేసి సమాచారం ఇవ్వాలి.



## పెద్ది రిలీజ్‌కు ముందు

# భారీ షాక్

- పర్సంటేజ్ కావాల్సిందేనని ఎగ్జిబిటర్ల డిమాండ్
- ఎగ్జిబిటర్ల కీలక నిర్ణయం

**టి మీడియా, మే 23, హైదరాబాద్ బ్యూరో:**

పెద్ది సినిమా రిలీజ్?కు ముందు తెలంగాణ ఎగ్జిబిటర్ల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో పర్సంటేజ్ ఇస్తేనే సింగిల్ స్క్రీన్లలో సినిమాలు ప్రదర్శిస్తామని ఎగ్జిబిటర్లు స్పష్టం చేశారు. పెద్ది సినిమా నుంచే పర్సంటేజ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే ఆ పర్సంటేజ్ ఎంత శాతమో అనేది నిర్మాతలు తమతో సమావేశమై నిర్ణయించాలని చెప్పారు. శనివారం హైదరాబాద్ తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో తెలంగాణ ఎగ్జిబిటర్ల అసోసియేషన్ కీలక సమావేశం నిర్వహించింది. ఈ మీటింగ్?లో తీసుకున్న నిర్ణయాలను అసోసియేషన్ సభ్యులు మీడియాకు వెల్లడించారు.

ఇప్పటికి రెండు మూడు సార్లు తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కమిటీతో చర్చలు జరిపాం. గతంలో హరిహర వీరమల్లు మూవీ రిలీజ్ టైమ్?లో రెండు నెలల్లో మా సమస్యను పరిష్కరిస్తాం అని చెప్పారు. కానీ ఏడాది అయినా పరిష్కారం లేదు. ఈ విషయంలో ప్రొడ్యూసర్లు కావాలని ఆలస్యం చేస్తున్నారు. తొలుత 3 వారాలు అని అన్నారు. అయితే ఇప్పుడు మరో 3 వారాలంటూ వాయిదా వేస్తున్నారు. మేమైతే పర్సంటేజ్ ప్రకారం ఇస్తేనే సినిమాలు ఆడిస్తాం. 15 ఏళ్ల కిందటే థియేటర్లకు లాభాలు ఉండేవి. కానీ ప్రస్తుతం పరిస్థితిలు మారిపోయాయి. ఇప్పుడు 120 మంది థియేటర్ల ఓనర్లు దీనస్థితిలో ఉన్నారు. కానీ, ప్రొడ్యూసర్లకు మాత్రం 14 రకాలుగా ఆదాయం వస్తుంది. యావత్ దేశమంతటా థియేటర్స్‌లో పర్సంటేజ్ విధానమే ఉంది. కానీ ఇక్కడే రెంటల్ సిస్టమ్? అమలులో ఉంది. ఈ సమస్యకు పరిష్కారాన్ని మరింత ఆలస్యం చేస్తున్నారు. మా థియేటర్లలో రెంట్ ట్రాక్ అమలు చేసేందుకు మేం సిద్ధమే. మా నుంచి తప్పు జరగడం లేదు. థియేటర్లలో ఏసీ, సౌండ్ సిస్టమ్ కాదు, అక్కడ వచ్చే వసూళ్లను బేస్ చేసుకొని గ్రేడింగ్ చేయాలి. ఆ విధంగా గ్రేడింగ్ చేస్తే మేం సిద్ధం. కానీ మాకు కావాల్సింది పర్సంటేజ్ విధానమే. అది 5 శాతమా, 10 శాతమా అనేది నిర్మాతలే తేల్చాలి. సమావేశం నిర్వహించి క్లారిటీ ఇవ్వాలి' అని తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ సభ్యులు తెలిపారు.

తెలంగాణాలో రేటు పెంచొద్దని సీఎంకు చెప్పాం

పెద్ది సినిమా విషయంలో తెలంగాణలో టికెట్ రేట్ పెరగదని ఈ సందర్భంగా చెప్పారు. టికెట్ రేట్ పెంచకూడదని రీసెంట్?గా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎగ్జిబిటర్ అసోసియేషన్ వినతి పత్రం ఇచ్చినట్లు చెప్పారు. 'ఆంధ్ర ప్రదేశ్?లోనే పెద్ది టికెట్ రేట్లు పెరగొచ్చు. తెలంగాణలో మాత్రం ఎలాంటి పెంపు లేదు. రేట్లు పెంచ వద్దని, ప్రేక్షకులను చంపొద్దని సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఛాంబర్‌కు మేం వినతి లేఖ ఇచ్చాం. ఒకవేళ పెంచాలని నిర్ణయం తీసుకుంటే మాత్రం, డిమాండ్ అండ్ సప్లయ్ ఆధారంగానే మేం నిర్ణయం తీసుకుంటాం'

పెద్ది లాంటి భారీ సినిమాలకు మేం కూడా సెల్యూట్ చేస్తాం. ఆ సినిమాపై మాకు ఎలాంటి ద్వేషం లేదు. పెద్ది చిత్రాన్ని ఈ వ్యవహారంలో నుంచి మినహాయించాలనే మేం అనుకున్నాం. కానీ, ఇప్పుడు పోతే మళ్లీ మమ్మల్ని ఎప్పుడు పట్టించుకుంటారనేది తెలియకనే ఈ సినిమాకూ పర్సంటేజ్ విధానంలో ఆడించాలని నిర్ణయం తీసుకున్నాం. అవసరమైతే మా సమస్యను మెగాస్టార్ చిరంజీవి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం దిశగా పని చేస్తాం' అని అన్నారు.



## గాలివాన బీభత్సం..

**టి మీడియా, మే 23, హైదరాబాద్ బ్యూరో :** శనివారం తెలంగాణలోని నాగర్‌కర్నూల్ జిల్లాలో, ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లి, కాకినాడ జిల్లాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. గాలితో కూడిన వర్షం అల్లకల్లోలం సృష్టించింది. గాలివాన బీభత్సం కారణంగా ఏపీలో ఇద్దరు, తెలంగాణలో ఒకరు మృత్యువాత పడ్డారు. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం గోవిందాయిపల్లిలో పిడుగుపాటుకు ఒక గొర్రెల కాపరి మృతిచెందాడు. అచ్చంపేటలో భారీ వర్షం కారణంగా ధాన్యం తడిసిపోయింది. ఏపీలోని అనకాపల్లి జిల్లా నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో దాదాపు అరగంటపాటు గాలి, వాన రావడంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. రమణయ్యపేట, ముకుందరాజుపేట, దోసలపాడు, చీడిక, జి.జగన్నాథపురం, గొడిచర్ల, డొంకాడ, చినదొడ్డిగల్లు గ్రామాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి. సత్యవరం గ్రామంలో కొబ్బరిచెట్లు నేలకూలి తమలపాకులు సేకరించే ఇద్దరు కూలీలు ప్రాణాలు కోల్పోయారు. ముకుందరాజుపేటలో ఇంటి రేకులు పడి ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. గాలుల ప్రభావంతో భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. మామిడి, అరటి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కాకినాడ జిల్లా తుని ప్రాంతంలో భారీ ఈదురుగాలులకు తలుపులమ్మ తల్లి ఆలయ మార్గంలో కారుపై చెట్లు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాలేదు.

# తిరుమల శ్రీవారి దర్శనానికి పోటెత్తుతున్న భక్తులు

- నిండిన క్యూ కాంప్లెక్స్‌లు

**టీ మిడియా ,మే 23, తిరుమల**

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. తిరుగిరులు వారం రోజులుగా కిటకిటలాడుతున్నాయి. దేవ దేవుని దర్శనం కోసం వేలాది మంది భక్తులు తరలిరావడంతో క్యూ కాంప్లెక్స్‌లు నిండిపోయాయి. వేసవి సెలవుల దృష్ట్యా ప్రత్యేక చర్యలు చేపట్టిన టీటీడీ వివిధ శాఖల సమన్వయంతో గతంలో ఎన్నడూ లేని రీతిలో భక్తులకు దర్శనాలు చేయిస్తోంది. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు అందిస్తోంది.

వేసవి సెలవులు – తిరుమల రద్దీ

తిరుగిరులు భక్తజనంతో కిటకిటలాడుతున్నాయి. కొండంత జనం శ్రీవారి దర్శనానికి తరలివస్తున్నారు. వేసవి అంటేనే శ్రీవారి భక్తులకు ప్రత్యేక అనుభూతి. కోరిన కోరికలు తీర్చే కలియుగ వైకుంఠనాథుని తనివితీరా దర్శించుకొని మొక్కులు చెల్లిస్తారు. సుమారు 45 రోజుల పాటు దేశ వ్యాప్తంగా విద్యార్థులకు సెలవులు ఉండటంతో



శ్రీవారి దర్శనానికి తరలి వస్తున్నారు. కోనేటి రాయుడిని కొండ భక్తులతో నిండిపోయింది. వారం రోజుల నుంచి తిరుమలకు అధిక సంఖ్యలో భక్తులు చేరుకుంటున్నారు. వైకుంఠ క్యూ కాంప్లెక్సులు, నారాయణగిరి ఉద్యానవన షెడ్లు, ఔటర్ రింగు రోడ్డు క్యూలైన్లు కిటకిటలాడుతున్నాయి. రియల్ టైమ్ మానిటరింగ్: సీఎం చంద్రబాబు సూచనల మేరకు తిరుమలలో టీటీడీ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ప్రణాళికబద్ధంగా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ద్వారా నిరంతర పర్యవేక్షణతో భక్తులకు మెరుగైన సేవలను అందిస్తున్నారు. సమయపాలన, క్యూలైన్ మేనేజ్మెంట్ ద్వారా రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తూ శ్రీవారి దర్శనంతో పాటు వసతి, అన్నప్రసాదాలను అందజేస్తున్నారు. సామాన్య భక్తుల సౌకర్యార్థం వీఐపీ సిఫార్సు లేఖలపై ఇచ్చే దర్శనాలను రద్దు చేశారు. గత శుక్రవారం నుంచి నిన్నటి వరకు సుమారు 6 లక్షల మంది స్వామి వారిని దర్శించుకున్నారు. వేసవి రద్దీని ముందస్తుగా అంచనా వేసిన టీటీడీ అధికారులు తిరుపతి జిల్లా యంత్రాంగాన్ని అనుసంధానం చేశారు. తోపులాటలు, ట్రాఫిక్, క్రైమ్ వంటి సమస్యలకు తావులేకుండా పోలీసు సిబ్బందిని నియమించారు. వారాంతపు సెలవుల నేపథ్యంలో భక్తుల రద్దీ పెరగనున్నందున టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. భక్తుల భద్రతతే ప్రధాన లక్ష్యంగా టీటీడీ విజిలెన్స్, పోలీస్ శాఖలతో పాటు మిగిలిన విభాగాలు పనిచేస్తున్నాయి.

# ఇంధన ధరల పెంపుపై కాంగ్రెస్ ఫైర్

- వాయిదాల పద్ధతిలో దోచేస్తున్నారని ఖర్గే విమర్శ

**టీ మిడియా ,మే 23, ఢిల్లీ బ్యూరో**

దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలను మరోసారి పెంచడంపై కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించింది. దాదాపు పది రోజుల వ్యవధిలో మూడోసారి ఇంధన ధరలు పెంచడం ద్వారా సామాన్య ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ప్రజల సంపాదనను వాయిదాల పద్ధతిలో కేంద్రం దోచుకుంటోందంటూ ఆయన మండిపడ్డారు. శనివారం సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో స్పందించిన ఖర్గే, పెట్రోల్, డీజిల్‌పై కేంద్రం ఇప్పటికే భారీగా పన్నులు వసూలు చేస్తున్నప్పటికీ ధరల పెంపు ఆగడం లేదన్నారు. పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర ప్రభుత్వం ప్రతిరోజూ దాదాపు వెయ్యి కోట్ల రూపాయల వరకు పన్నుల రూపంలో ఆదాయం పొందుతోందని, అయినా ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు తక్కువగా ఉన్న సమయంలో ప్రజలకు లాభం చేకూర్చకుండా కేంద్రం భారీగా ఆదాయం సమీకరించుకుందని ఆయన ఆరోపించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభ పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్న ఖర్గే, అలాంటి సమయంలో అనేక దేశాలు తమ పౌరులపై భారం తగ్గించే చర్యలు తీసుకున్నాయని గుర్తుచేశారు. ఇటలీ ఇంధనాలపై ఎక్సైజ్ సుంకం తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించిందని, ఆస్ట్రేలియా కూడా పన్నులు తగ్గించడం ద్వారా లీటరుకు దాదాపు రూ.17 వరకు ధరలను తగ్గించిందని



తెలిపారు. జర్మనీ కూడా చమురు పన్నులను తగ్గించి పెట్రోల్, డీజిల్ ధరలను నియంత్రించిందన్నారు. బ్రిటన్‌లో ఇంధన సాయంగా కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు విద్యుత్, ఇంధనాలపై పన్నులు తగ్గించారని చెప్పారు. ఐర్లాండ్ కూడా భారీ ఉపశమన ప్యాకేజీ ప్రకటించి ప్రజలపై భారం తగ్గించిందని వివరించారు.

భారతీయులంతా అర్థం చేసుకున్నారు!

ఇతర దేశాలు ప్రజలకు ఉపశమనం కల్పించే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ భారత్‌లో మాత్రం వరుసగా ధరలు పెంచడం ఏ రకమైన పరిపాలన అని ఖర్గే ప్రశ్నించారు. దేశంలో అసలు సంక్షోభం నాయకత్వానిదేనని, 140 కోట్ల మంది భారతీయులు ఇప్పుడు ఆ విషయాన్ని అర్థం చేసుకున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఒకలా, ఎన్నికల అనంతరం మరోలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు. ఇంధన ధరల పెంపుపై కాంగ్రెస్ పార్టీ కూడా కేంద్రంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాన్య ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని ఆరోపించింది. ప్రపంచ దేశాలు ద్రవ్యోల్బణాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటుంటే, భారత్‌లో మాత్రం చమురు సంస్థల లాభాల కోసమే కేంద్రం పనిచేస్తోందని విమర్శించింది. ప్రజల సంక్షేమం కంటే కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. ఇక శనివారం పెరిగిన తాజా ధరల ప్రకారం దేశ రాజధాని దిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు 87 పైసలు పెరిగి రూ.99.51కు చేరగా, డీజిల్ ధర 91 పైసలు పెరిగి రూ.92.49కు చేరింది. కోల్‌కతాలో పెట్రోల్ ధర రూ.110.64కు, డీజిల్ ధర రూ.97.02కు పెరిగింది. ముంబయిలో పెట్రోల్ ధర రూ.108.49కు, డీజిల్ ధర రూ.95.02కు చేరింది. చెన్నైలో పెట్రోల్ రూ.105.31కు, డీజిల్ రూ.96.98కు పెరిగింది. అంతకంటే ముందు మే 15న కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ.3 చొప్పున పెంచింది. ఆ తర్వాత మే 19న మరోసారి ధరలు పెరిగాయి. తాజాగా శనివారం మరో పెంపు చోటుచేసుకోవడంతో కేవలం పది రోజుల వ్యవధిలోనే ఇంధన ధరలు దాదాపు రూ.5 వరకు పెరిగినట్లైంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణలు, ముఖ్యంగా హర్మూజ్ జలసంధి ప్రాంతంలో నెలకొన్న అనిశ్చితి కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు పెరుగుతున్నాయి. ఈ ప్రభావం భారత్‌పై కూడా పడుతోందని కేంద్రం వర్గాలు చెబుతున్నప్పటికీ, ప్రజలపై భారం తగ్గించే చర్యలు తీసుకోవాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. వరుసగా పెరుగుతున్న ఇంధన ధరలతో ఇప్పటికే ద్రవ్యోల్బణ భారం ఎదుర్కొంటున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు మరింత ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతోంది.

# ఇంధన సంక్షోభంతో పాత రోజులు

- మళ్లీ ఎద్దుల బండ్లు రీఎంట్రీ

**టీ మిడియా ,మే 23, ఢిల్లీ బ్యూరో**

ఇరాన్– అమెరికా యుద్ధంతో తీవ్ర ఇంధన సంక్షోభం ఏర్పడింది. పెట్రోలు, డీజిల్ ధరలు రెక్కలు తొడిగాయి. దీని ప్రభావం కొన్ని గ్రామీణ ప్రాంతాలపై స్పష్టంగా కనిపిస్తోంది. ఆయా పల్లెల్లో ఎద్దుల బండ్లపై రాకపోకలు మళ్లీ పెరిగాయి. ఇక పొలాలను దున్నేందుకు చాలా ఏళ్ల తర్వాత ట్రాక్టర్లకు బదులుగా ఎద్దులను రంగంలోకి దింపారు. పలువురు గ్రామీణ యువకులు తమ ఎద్దుల బండ్లలో సరుకులను రవాణా చేస్తూ ప్రతిరోజూ రూ.1000 నుంచి రూ.1500 దాకా సంపాదిస్తున్నారు. ఇంతకీ ఈ పల్లెలు ఎక్కడ ఉన్నాయి? ఒకప్పుడు ఓ ఎంపీ చొరవతో ఎద్దుల బండ్లకు నంబర్ ప్లేట్లనూ కేటాయించారు తెలుసా? వాటికి లైసెన్సులు ఇవ్వడంతో పాటు ట్యాక్సులూ వేసే వారు. ఈ అంశాలపై పరిశీలనాత్మక కథనమిది.

**ట్రాక్టర్ల స్థానంలోకి ఎద్దుల బండ్లు**

గయ జిల్లాలోని కర్మోని గ్రామానికి చెందిన డ్రైవర్ వినయ్ యాదవ్‌కు సొంత ట్రాక్టర్ ఉంది. గతంలో ఆయన ట్రాక్టర్‌ను వ్యవసాయంతో పాటు సరుకులను రవాణా చేసేందుకు వినియోగించేవారు. కానీ డీజిల్ సంక్షోభంతో వినయ్ ఆలోచన మారింది. ఆయన ట్రాక్టరును పక్కన పెట్టారు. రూ.60వేలతో రెండు జతల ఎద్దులను, ఒక గేదెను కొన్నారు. ఇంట్లో మూలకు పడి ఉన్న పాత ఎద్దుల బండ్లను బాగు చేయించి, వాటితో సరుకులను రవాణా చేస్తున్నారు. వినయ్ తన దగ్గరున్న రెండు ఎద్దుల బండ్లతో ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి సరుకులను రవాణా చేస్తూ, రోజుకు రూ.1,000 నుంచి



రూ.1,500 దాకా సంపాదిస్తున్నారు. ట్రాక్టరులో సరుకుల రవాణాకు అధిక ఛార్జీలను చెల్లించడానికి ప్రజలు ఇష్టపడటం లేదని, అందుకే ఎద్దుల బండ్లతో ఆ పనిని చేస్తున్నానని వినయ్ చెప్పుకొచ్చారు.

**జన జీవితాలకు ఆధారంగా ఎద్దుల బండ్లు**

ఈనేపథ్యంలో చిన్న, సన్నకారు రైతులు మళ్లీ ఎద్దుల బండ్లను రంగంలోకి దింపారు. చాలా సంవత్సరాల తర్వాత, ఇప్పుడు వారి పొలాలను ఎద్దులు దున్నుతున్నాయి. ఒకప్పుడు గ్రామాలకు గుర్తింపుగా నిలిచిన ఎద్దుల బండ్లు ఇప్పుడు మరోసారి ప్రజల ఉపాధి, వ్యవసాయం, దైనందిన జీవితానికి ముఖ్యమైన ఆధారంగా మారుతున్నాయి. గయ జిల్లాలోని కర్మోని, నిస్ఖా, ఫజ్లహా, గోడ్వా దీహ్, నవ్వా దీహ్, మాన్సీ దీహ్, మున్నిచక్, కురుమ్దిహ్, కుషా, పక్రి, బరచట్టి, ఇమామ్‌గంజ్, బాంకే బజార్, దోభి, బోధగయ, షేర్‌ఘాటి వంటి అనేక గ్రామాలలో వేలాది ఎద్దుల బండ్లు రంగంలోకి దిగాయి.

**ఇప్పుడు మళ్లీ వాటి అవసరం వచ్చింది**

"నా వయసు 80 ఏళ్లు. గతంలో 7 ఎద్దుల బండ్లతో నా పెళ్లి ఊరేగింపు జరిగింది. నా కొడుకు పెళ్లి ఊరేగింపు కూడా ఎద్దుల బండిలోనే జరిగింది. 2000 సంవత్సరం తర్వాత ఎద్దుల బండ్ల సేవలు చాలావరకు తగ్గిపోయాయి. అయితే ఇప్పుడు మళ్లీ వాటి అవసరం వచ్చింది. అందుకే నేను ఎద్దుల బండ్లను నడుపుతున్నాను. నా సొంత పనులతో పాటు ఇతరుల సరుకులను కూడా వాటితో రవాణా చేస్తున్నాను" అని 80 ఏళ్ల విష్ణుధారి తెలిపారు.

**1990 నుంచి ఎద్దుల బండి నడుపుతున్నాను**

"నేను 1990 నుంచి ఎద్దుల బండి నడుపుతున్నాను. గత కొన్నేళ్లుగా ఇది నష్టాల వ్యాపారంగా మారింది. కానీ ఇప్పుడు నా ఆదాయం పెరిగింది. నేను 5 కిలోమీటర్ల వరకు సరుకులను రవాణా చేయడానికి రూ.250 తీసుకుంటాను. రోజుకు మూడు ట్రిప్పులు వేసి రూ.700 నుంచి రూ.800 వరకు సంపాదిస్తాను" అని రాజు యాదవ్ తెలిపారు.

**ఎద్దుల బండ్లకు నంబర్ ప్లేట్లు**

ఎద్దుల బండ్లపై చర్చ జరుగుతున్న వేళ బిహార్ మొదటి దళిత ఎంపీ బాబు కిరాయ్ ముసహర్ పేరు మరోసారి తెరపైకి వచ్చింది. ఆయన 1952లో సోషలిస్ట్ పార్టీ టికెట్‌పై భాగల్పూర్–పూర్నియా రిజర్వుడ్ సీటు నుంచి ఎంపీగా ఎన్నికయ్యారు. ఆయనను పేదలు, కార్మిక వర్గాల గొంతుకగా పరిగణించేవారు. భారత రాజ్యాంగం ప్రకారం రవాణా, స్థానిక పన్నులు, మున్సిపాలిటీలు, జిల్లా బోర్డుల నిర్వహణ అనేది పూర్తిగా రాష్ట్ర జాబితా పరిధిలోకి వస్తుంది. దీని ప్రకారం ఎద్దుల బండ్లను నియంత్రించే, పన్నులు వేసే హక్కులు స్థానిక సంస్థలవే. అయితే అవి కాగితాలకే పరిమితమై, క్షేత్రస్థాయిలో సరిగ్గా అమలు కాకపోవడంతో నాటి ఎంపీ బాబు కిరాయ్ ముసహర్ చొరవ చూపారు. ఎద్దుల బండ్లను నియంత్రించడానికి పన్ను, లైసెన్స్ వ్యవస్థను స్థానిక సంస్థలతో అమలు చేయించారు. ఆ సమయంలో ప్రతీ ఎద్దుల బండికి ఒక నిర్దిష్ట నంబరును కేటాయించేవారు. టిన్ ప్లేట్‌పై ఆ నంబరును ముద్రించి వాటికి బిగించేవారు. ఎద్దుల బండ్ల వివరాలను గ్రామ పంచాయతీలలో నమోదు చేసి ఉంచేవారు. వాటిని గ్రామీణ రవాణా వ్యవస్థలో ఒక ముఖ్యమైన భాగంగా పరిగణించేవారు.